# వసంత తిలక

- మల్లాది రామకృష్ణశాస్త్రి

*ఆంధ్ర కథా విష్ణువు, బహుభాషావేత్త, మార్గదర్శి, పోత పోసిన ప్రతిభ మల్లాది రామకృష్ణశాస్త్రి. కథనంలో జాను తెలుగు, సంభాషణల్లో మాటకారితనం, ఆపేక్షలే ఆకృతులైన పాత్రలు ఆయన కథలకు ఆనవాళ్లు. అక్షరాలలో ఒక ఠీవి, పదాల పోహళింపులో దర్పం, వాక్యాలలో మొగలి అత్తరు గుబాళింపు, సర్వే సర్వత్రా స్వరాక్షరాల సొంపు మల్లాది వారి శాస్త్రీయానికి నిదర్శనాలు. వారి ఏ కథ చదివినా కొసరి కొసరి వడ్డించి, వినిపించిన తెలుగు భోజనపు అనుభవమూ ఆపైన పచ్చకర్పూరపు తాంబూలం సేవించిన అనుభూతీ కలుగుతాయి. దీపావళి పండుగ నాడు మీరు మళ్లీ చదివి ఆనందించాలని యీ కథ సమర్పిస్తున్నాం.*

నదీ ప్రవాహం ఉదయ సూర్యునికి అర్ఘ్యమిస్తున్నది. పర్వత శ్రేణి జపం జేస్తున్నది.

ఏరు, పాయవిచ్చిన, శిలమీద, ఆయన కూర్చుని సంధ్యా వందనం జేసుకుంటున్నాడు. స్నానానికి వచ్చినవాడు గనుక కీర్తి ప్రతిష్ఠలను వెంటబెట్టుకు రాలేదు. పైన శాలువ లేదు. ఏమంత రూపసి కాదు. కొట్టొచ్చినట్టు వర్చస్వి కాదు. బాగా బతికే ఓ తగుపాటి బ్రాహ్మణుడు. ఆయన ఫలానా అని ఎరుగనివారు గుర్తించటం ఎలా?

ఎవరు గుర్తించినా మానినా ఆయనే పెద్దన్నగారు.

అంటే అల్లసాని పెద్దన్నగారు. అవును, మనిషిని చూసి మహిమ తెలుసుకోవడం మనకు అన్నివేళలా సాధ్యమా?

సంధ్యా వందనం ముగించుకుని, వారు గట్టుకు రాగానే ఒక చిన్నవాడెదురైనాడు. మ్రొక్కినాడు.

"ఏమి నాయనా" అన్నారు.

"యాచనకు వచ్చా"నన్నాడు.

"ఏ సీమనుంచి?"

"ఫలానా సీమనుంచి!"

"అక్కడ దాతలే లేరా?"

"నాకు కావలసింది కన్యాదాత!"

"అలాగా, నన్ను వెదుక్కుంటూ వచ్చావా? నేను రాయలవారి ఆస్థానంలో పెద్ద పీఠం వేయించుకున్నవాడిని. వారి భోగ భాగ్యములన్నీ, కవుల కనుసన్నలలో ఉంటాయి. కనుక తూగివచ్చే సామంతం మీకుందా?"

"నాకున్న భాగ్యం- మా తల్లిదండ్రులే"

"అంతకన్న అదృష్టమేముంది?"

"మీ అల్లుణ్ణి కావడం! మీకు పుట్టుకతోనే పెద్దరికం అబ్బింది. నన్ను పెద్దను చేయాలంటే అది మీ వల్లనే అవుతుంది. యిక నా గుణగణాలంటారా? మా పిల్లల యోగ్యత గమనించిన మీదట మీకే తెలిసి వస్తుంది."

"ఆహాఁ ఏం, పిల్లలకు తాతగారి పోలిక రాకూడదా? నా అంతవారు కాకూడదా?"

"అది సాధ్యమా! యీ యుగానికి పెద్దన్న గారిదే పెద్దరికం."

"ఎందులో పెద్దరికం- కవనంలోనా?"

"కాదు, మంచితనంలో. నాకు కవనమంటే గిట్టదు. కవులంటే అసలే సరిపడదు. కవుల దర్శనాని కింతదూరం రాలేదు. నాది క్షాత్ర విద్య. విద్యానగరం వారికి యెప్పుడూ నావంటి జోదు అవసరమే గనుక రాయలవారి కీర్తికి నా బాహుబలం ఆసరాగా ఉంటుందని వచ్చాను. వచ్చి నేటికి పది ప్రొద్దులయింది లెండి. సత్రంలో భోజనం కాదు, సంచి కట్టుతోనే వచ్చాను."

"ఎవరి దర్శనానికి పోలేదు. ఎందుచేత? వర్తకుని వద్దకు మణి వెదుక్కుంటూ వెళుతుందా? వాళ్లే రావాలి!"

"నేను వెళ్లిందల్లా విరూపాక్ష ఆలయానికి. అక్కడ ధూర్జటి కనిపించినాడు. ఆయనని నాకు అంతకుముందు తెలియదు. ఆ విభూతి రేఖలు చూడగా ముచ్చటవేసి, 'అయ్యా, నాచేత కూడా అలా పెట్టించండి' అన్నాను! ఆయనలోనూ కొంత క్షాత్రముందండీ! 'బలే, నా గీతలు నావే- నీకు అంటవురా-' అని సాగిపోయినాడు. ఎదురైనవారు పేరున పిలిచి మ్రొక్కడంతో వారు వారని తెలిసింది. యిక వెంటబడ్డాను. 'ఏం' అన్నారు. 'అయ్యా, మీ మొగం హిమాలయ శృంగం వలె గంభీరంగా ఉంది.

## ఆణిముత్యాలు

నాకు కావలసిన దక్కడుంది- విభూతి! ఎక్కడో వెదకడమెందుకని వెంటబడ్డాను' అన్నాను.

ఆయన ఒక్క నవ్వు నవ్వి- చేరదీసుకున్నారు. యిద్దరం అలా కలసి నడుస్తున్నాం. నృసింహస్వామి ఆలయ ప్రాంతానికి వచ్చాం. అక్కడో అమ్మాయిని ఆయన పలుకరించారు.

'ఏవమ్మా విశాలాక్షీ!' అన్నారు. 'నాన్న ఏం జేస్తున్నాడమ్మా' అన్నారు. 'ఎప్పటిలాగే పరధ్యానంలోనే ఉన్నాడు- మామయ్యా!' అన్నది.

'మన్నించాలి!' నాకు నవ్వు వచ్చింది. మీ అమ్మాయి అంతలో నన్ను చూసి బిడియపడ్డది- తలవొంచుకుని వెళ్లిపోయింది. అలా చూడటం తటస్థించింది- ఒకరినొకరు!

'ఎవరో ఎరుగుదువా' అన్నారు. నేనేమెరుగుదును- కాని, ఏ జన్మలోనో చూసినట్లుంది- లేకపోతే అలా పలుకరించినట్లు- నన్ను చూసి బిడియపడుతుందా? ఆమె కదలిపోతూంటే మరెక్కడికో కాదు- మా యింటికే, మేం కాపురం జేసే లోగిలికే అని అనిపించింది- యీ మాట వారితో అనలేదు సుమండి! మీ దగ్గిర దాచతరం కాకపోయింది.

ఆయన అన్నారు కదా- 'పెద్దన్న కుమార్తెరా! అంటే ఆంధ్ర కవితా పితామహుడంటారే అతగాడు! నిజానికి అంత వయసు లేదు; కాకపోయినా పితామహుడయ్యే యోగ్యతా లేదు. ఉన్నది- యీ ఒక్క పిల్లే!

'యిక, కవిత్వమంటావా! అది మనిషిలో ఉంది- మాటలో అంతగా లేదు! ఒకవేళ, ఉందనుకున్నా- అది ఆ యింట రాణింపుకు రాదు- ఎందుచేతనంటే మా అక్కయ్య ఉందే- ఆయన భార్య- సిసలైన కవిత్వమంటే అక్కడ! గంగా ప్రవాతమనుకో- ఒక్క మాటలో పోయేదానికి- ఒక్క కావ్యం ఏకరువు పెట్టినంత గణగణలాడుతుంది. ఆమె అనుక్షణమూ రచించే- గ్రంథానికి అవతారిక, ఆశ్వాసాంత పద్యాలూ యీయన మౌనం! కనుకనే నెగ్గుకు వస్తున్నారు. అది చూడ ముచ్చటైన సంసారమనుకో. వాళ్లది- పార్వతీ పరమేశ్వరుల అన్యోన్యం. యిక యీ అమ్మాయి అంటావా?- ఎవరో ధన్యుడు పుట్టి పెరుగుతున్నాడు.'

వారిలా అంటూండగా- నేను మనసులో 'నేనే' అనుకుని- మ్రొక్కాను. 'తలచింది సాధిస్తావు పోరా' అన్నారు- తమ దర్శనానికి వచ్చాను!"

"అహ!" అన్నారు పెద్దన్నగారు.

"నీ పేరేమిటి?"

"ఊళ్లో రాజశేఖరం! యింట్లో రాజన్న!"

"ఊళ్లో మాట మనకెందుకులే- రాజన్నా! కత్తిపట్టి, పగవాణ్ణి కొట్టి- రాలిన రత్నరాసులకు, రాజుతోబాటు భాగస్వామి వవుదామని ఉందా!"

"రత్నం కోసం కొండ తవ్వుతాను కాని, రక్తపాతం జేస్తానా?"

"--చేసిన వారి కీర్తి జయస్తంభం మీదికి ఎక్కుతుంది. తెలుసునా?"

"అదేమో కాని, మంచితనం కొండెక్కుతుంది! నేనంత ప్రయోజకుణ్ణి కాలేను!"

"కాక, యిల్లరికపు టల్లుడవౌతావా?"

"అయితే, ఏలినవారి కంటె ఘనుణ్ణే."

"అదెలానోయీ-"

"--కృష్ణుడు మేనమామను చంపితే-"

"యీ కృష్ణుడు అదేమిదేమని మామగారినే హతం జేసి-"

"అహ, అలాక్కాదు! మనిషిని హతమార్చి తదుపరి మామను జేసుకుని, తగుదునమ్మా- అనిపించుకోవడం నిజంగా మీవంటి ఉత్తములు హర్షించారా? మనుచరిత్ర మీ మనఃపూర్వకంగా అంకితం జేశారా? ఆ మొండివాడిని ఎలాగో వదిలించుకుందామని కాదూ-

కాకపోతే, మళ్లీ ఎందుకు గంటం చేతపట్టలేదు!

ఆనాడు రాయలవారు నిండు కొలువులో, స్వహస్తాలతో సమర్పించిన గండపెండేరం, తాము మరల ధరించగా ఎవ్వరూ చూడలేదేం! అది తమ వద్దనే భద్రంగా ఉందా? కళింగ రాజ్యంలో హతశేషులకు ఆ సొమ్ము వినియోగించవలసినదిగా తాము పంపించినారని, మా ప్రాంతందాకా ప్రాకిందే- అందరు కవులూ రాయలవారితోబాటు అందలాలెక్కి అరదాలెక్కి ఊరేగినారే కాని, మీరు ఒక్కనాడూ ఆ గౌరవానికి అంగీకరించలేదే! ఏమండీ- ఏమంటారు? మనువుకు మారణహోమం తలపెట్టే వారికన్న నేను ఘనుణ్ణి!"

"ఔనోయి. నీవు మా లోగిలిలో అవశ్యం ఉండవలసిన వాడవే- నీ వాగ్ధోరణి వింటే మా యిల్లాలు బ్రహ్మానందభరితురాలౌతుంది. మీరిద్దరూ సంభాషణకి ఉపక్రమించితే నేనింతకు పూర్వం రణరంగ కోలాహలం ప్రత్యక్షంగా అనుభవించని కొరత తీరుతుంది. రా... వెంటరా!"

"రాక మానేనా? రాకముందు, ఒక్కటి తెలుసుకోవాలి. మీ చిరంజీవి ఎవరి పోలిక?"

"చూశావుగా- ఆకారంలో ముమ్మూర్తులా నేనే. కనుకనే, పరరాజు లెవ్వరూ మా అందాలరాశి కోసం దండెత్తి రాలేదు. యిక అంతరంగమంటావా! తప్పకుండా తల్లి చారిక రావాలి. యిప్పటివరకూ మితభాషే. అంటే, పడేవాడొకడు ఎదుట పడితే... అప్పటికి ఆ కవిత్వం పుట్టుకువస్తుంది. అందుకు నీవు సిద్ధమేనా?"

"మహిమలో గాకపోయినా మౌనానికి నేనూ పెద్దన్ననే-"

పెద్దన్నగారు మందహాసం చేసినారు. యిద్దరూ యింటికి వచ్చినారు.

యింకా పదిబారల దూరాన ఉండగానే పెద్దన్నగారు భార్య పలుకు లాలించి, రాజన్న వంక జూసినారు. అతడు నవ్వబోయి ఊరుకున్నాడు.

గుమ్మంలో విశాలాక్షి ఎదురైంది. తండ్రిని జూసింది. తగువానిని జూసింది. అడుగు వెనుకకు వేయబోయింది.

"ఆగవమ్మా!" అన్నారు.

"మీ మామయ్య వెంట యీతణ్ణి చూశావు కదూ..."

"పాద ప్రక్షాళనానికి అమర్చు..." అన్నారు. అమ్మాయి తలవంచుకుని లోనికి వెళ్లింది.

భోజనములు ముగిసేదాకా ఊరుకుని పెద్దన్నగారి భార్య రాజన్న వైనమడిగి తెలుసుకుంది. ఉగ్గుపాలనాటి ముచ్చటి దగ్గరి నుంచీ చెప్పించింది- విని, విని ఏమనుకున్నదో ఏమో, ఆ చిన్నవాణ్ణి ఎందుకు తెచ్చినట్లు అని పెద్దన్న గారిని మాటలతో నిలవేసింది. పలుకులతో పద్మవ్యూహం పన్నింది. అంతలో ధూర్జటి అక్కడికి రావడంతో ఆయనకు విమోచన కలిగింది.

వివాహం జరిగింది. ఆ కాపురం సలక్షణమే కాగా, పెద్దన్నగా రనినట్లుగానే పిల్లకు తల్లి పోలిక వచ్చింది. అప్పటినుంచీ ఆ యింట యిద్దరు మౌనులు!

మనుమడు పుట్టాడు. వాడికి తల్లి పోలికలతోబాటు ముత్తవతల్లి పోలిక కూడా వచ్చింది. యిక ఆనాటి నుండీ- పెద్దన్నగారు యింటికన్న రాజాస్థానమే పదిలమనుకుని- అక్కడికే పోయి కూర్చునేవారు. రాజన్నకు నృసింహస్వామి ఆలయం ఎడనెడ శరణ్యం.

ఒకనాడు ధూర్జటి పెద్దన్న గారితో- "బావా! నేను చేతనైన తీరున కాళహస్తీశ్వరుని కొలిచినాను. నీవు హరిని నీ కవనాన సేవించగా విన మనసైనది. నేను శైవుడనే కాని, వాని లీలలపై అదేమో మక్కువ మెండు. అది నా చేతనైన పనికాదు. అందుకు నీ అమాయకత్వమే తగును. గండపెండెరము వేయలేను కానీ, నీ కాలికి మ్రొక్కలేనా! బావా! నా దైవం చేత ధరించే భిక్షాపాత్రలో ఈ భిక్ష వేయవా?" అనగా, ఆయన కనుల ఆనందము వెల్లువ కట్టగా "నాకు ఆ అదృష్టమా!" అన్నారట! ఉపక్రమించినారట!

రాయ దస్తమించినాడు. ప్రజలు ఆక్రోశించినారు. పెద్దన్నగారు, ప్రసన్నంగా- "కృష్ణా! యిక నిశ్చింతగా నిద్రపో!" అనుకున్నారు.

పెద్దన్నగారికి వార్ధక్యము రాలేదు. మనుమని ఆటపాటలు చూసినారు. తనివి తీర్చుకున్నారు. యింటనున్న గంటములు, తాటియాకుల మేటులూ పాఠశాలలకు దానమిచ్చినారు. కుమార్తెతో, "అమ్మాయి, నేను వెళ్లి వస్తానమ్మా!" అన్నారు. ఎక్కడికని విశాలాక్షి అడుగలేదు. తల్లి దగ్గరకు పరుగుపెట్టింది. ఆ యిల్లాలు అదేమని అనుకుంటూ ఒక్క ఉరుకున వచ్చిపడినది.

ఆయన యజ్ఞోపవీతం తీసి, చేత నుంచుకుని ఆమె వంక జూచినాడు. ఆమె నిలువలేక గొల్లుమని- "యిప్పుడన్నా నాతో ఒక మాట చెప్పరా- నా అపరాధమేమో చెప్పరా?" అంటూ గగ్గోలు పెట్టింది. ఆయన ఆమె కన్నీరు తుడిచి, "నీవు వినిపించుకోలేదు కాని, యింతకాలం నిన్ను పిలిపించింది యీ మౌనమే... మనసు తెలిసినదానవు గనుక మాటలతో పనేమని ఊరకున్నాను. యిది సన్యాసము కాదు- సన్మార్గము. నేను కనుచాటైనా, నా మౌనము నీ కనుల ఎదుటనే ఉంటుంది" అంటూ యజ్ఞోపవీత మామెకు అందించి, కుమార్తెతో- "అమ్మా! హరినామ స్మరణ చేయమని ధూర్జటి ఆదేశించినాడు. గంటము చేతబట్టగా, కవనము రాలేదు కాని వెన్న దిన్నవాడు కన్నులగట్టి, అందీ అందక నన్ను మురిపించుతున్నాడు. వారిని తరుముకుపోయేనమ్మా" అంటూ యిల్లు విడిచినాడు.

-నడచిపోతూ, అనుకున్నాడు గద, అంతకాల మా కృష్ణుడు- యిక యీ కృష్ణుడు- యీ జన్మకీ తగులాటము శాశ్వతమే...!

●

## స్వార్థం

"హల్లో! కల్లోలా ఎంటర్‌ప్రైజెసేనాండీ?"

"అవునండి."

"నేను మీ దగ్గర పనిచేస్తున్న అసిస్టెంట్ మేనేజర్ రుక్మారావు గారి బావమరిదినండి. ఆయన్ని ఒక్కసారి ఫోన్లోకి పిలుస్తారా! చాలా అర్జెంట్ మేటర్."

"ఒక్క నిముషం..."

... ... ... ... ...

"హల్లో!"

"హల్లో బావగారూ! నేను విశ్వాన్ని. మీరు అర్జెంటుగా ఇంటికొచ్చేయండి"

"ఏమైంది విశ్వం? ఏమైనా సీరియస్సా?"

"అదంతా తరువాత మాట్లాడుకుందాం! మీరు ఉన్నపళంగా బయలుదేరి ఇంటికొచ్చేయండి."

"విశ్వం! ఏమైంది? నాకు చాలా గాబరాగా ఉంది. చెప్పు."

"బావగారూ! టైమ్ వేస్ట్ చెయ్యకండి. త్వరగా బయలుదేరి వచ్చేయండి."

"నా మనసేదో కీడు శంకిస్తోంది. విశ్వం! ఏమైందో చెప్పు."

"బావగారూ! ఫోన్ పెట్టేసి వెంటనే బయలుదేరండి. నేను ఫోన్ పెట్టేస్తున్నాను."

"హమ్మయ్య వచ్చేశారా? చాలా బ్యాడ్ న్యూస్ బావగారూ! ఇలాంటి పరిస్థితిలోనే ధైర్యంగా ఉండాలి. గుండె దిటవు చేసుకోండి."

"విశ్వం! ఏం జరిగిందో చెప్పు. టెన్షన్ భరించలేకుండా ఉన్నాను. ప్లీజ్..."

"సారీ బావగారూ! మీ అమ్మగారు... మీ అమ్మగారు పోయారట. ఇందాకే మీ నాన్నగారు ఇంటికి ఫోన్ చేసి చెప్పారు. అయామ్ వెరీ సారీ. వెంటనే బయలుదేరండి."

"హమ్మయ్య! చంపేవు కదా విశ్వం! నేనింకా నా భార్యకో, పిల్లలకో ఏమైందోనని హడలి చస్తున్నాను తెల్సా! బ్రతికించావు."

- కె.ఎస్.వి. ఆంజనేయులు